# హా... హతవిధీ

క్రిష్ణమూర్తి చాలా అందంగా వుంటాడు...

అతను ఆరడుగుల ఎత్తుంటాడు. ఎండలో నడిస్తే ఎర్రగా కందిపోయేటంత తెల్లగా వుంటాడు. ఉంగరాలు తిరిగి పోయినట్టుండే ఒత్తైన అతని జుట్టుని చూసి బట్టతల మగాళ్లు చాలా మంది ఈర్ష్య పడుతూంటారు. తెల్లని ప్యాంటుపైన, గంజిపెట్టి ఇస్త్రీ చేసిన ఖద్దరు సిల్కు చొక్కా తొడుక్కుని, అతను రోడ్డుపైన నడూస్తూంటే - ఎంతోమంది పెళ్లికాని ఆడ పిల్లలు - తమ చూపుల్ని మరోవైపు మరల్చుకోలేక - తమ దారి మర్చిపోతూంటారు...!

క్రిష్ణమూర్తి అందంగురించీ పర్సనాలిటీ గురించీ - ఒక్క మాటలో చెప్పమంటే, అలనాటి 'మిస్సమ్మ'లో 'ఎన్టీఆర్'లా వుంటాడని చెప్పాల్సిందే!... ఆ సినిమాలో 'ఎన్టీఆర్' ఎంత ప్రయత్నించినా ఉద్యోగం ఎలా దొరకలేదో - క్రిష్ణమూర్తికి కూడా అలాగే దోరకలేదు... అయినా విద్యార్హతలు చూసి ఉద్యోగాలిస్తారు కానీ అందచందాలు చూసి కాదుగా! మూడేళ్ల డిగ్రీని అతికష్టం మీద అంచెలంచెలుగా అయిదేళ్లలో పూర్తి చేసిన ఘనత అతనిది!

'ఆ మాత్రం చదువుకి ఏమాత్రమైనా ఉద్యోగం రాకపోతుందా! అనే ఆశతో, కనిపించిన ప్రతి 'వేకెన్సీ'కీ దరఖాస్తు పంపుకున్నాడు. రమ్మన్న ప్రతి ఇంటర్వ్యూకీ వెళ్లొచ్చాడు... కానీ ఫలితం లేకపోయింది...

ఒకవైపు 'ఏజ్' బారయిపోతోంది...! పోనీ పెళ్లిచేస్తే అతని దశ తిరిగి పెళ్లాంతో పాటు ఉద్యోగం కూడా దొరుకుతుందేమోనన్న ఆశతో, వాళ్ళనాన్న పేపర్లో ప్రకటన వేయించాడు... ఒకటిరెండు సంబంధాలు వచ్చాయి... అయితే, అవి మరీ 'నాసిరకం' కావటంతో సాహసం చేయలేకపోయారు.

సరిగ్గా ఆ సమయంలో - తంతే గారెలగంప లో పడ్డట్టు (క్రిష్ణమూర్తికి బూరెలంటే ఇష్టం లేదు) అనుకోకుండా అతను దమయంతి కంట్లో పడ్డాడు... దమయంతి ఆ ఊరి బ్యాంకులో ఆఫీసరుగా ఉద్యోగం చేస్తోంది...'మిస్సమ్మ'లో 'సావిత్రి' వున్నంత అందంగా కాకపోయినా - చూడగానే ఆకట్టుకునేటంత ఆకర్షణగా వుంటుంది...

ఆ రోజు ఏదో ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకుంటూ, దాంతో జత చేసేందుకు ఓ డ్రాఫ్ట్ కావాల్సి వచ్చి క్రిష్ణమూర్తి ఆ బ్యాంకుకి వచ్చాడు. అప్పుడు డ్రాఫ్టులిచ్చే కౌంటర్లో కూర్చున్న దమయంతి - యదాలాపంగానే అతన్ని చూసింది... అంతే...! క్షణం సేపు

మైమరపులో పడిపోయింది.... ఆ మైమరపులో ముందుగా తనచేతిలోని పెన్ను కింద పారేసుకుంది... తర్వాత తన ప్రమేయం లేకుండా మనసు పారేసుకుంది...'అలాంటి అందగాడు తనకు భర్తగా లభిస్తే ఎంత బాగుణ్ణు?' - అనుకుంది... అక్కడితో సరిపెట్టుకోకుండా- 'అసలు అతనే తన భర్తగా వస్తే?" అని కూడా ప్రశ్నించుకుంది మరుక్షణంలో...! అయిదు నిమిషాల్లో ఇవ్వగలిగే డ్రాఫ్ట్ కోసం - కావాలనే, అతన్ని తన ముందు అరగంట నిలబెట్టుకుంది... అఖ్ఖర్లేని వివరాల్ని సైతం 'డ్రాఫ్ట్ అప్లికేషన్' వెనకాల రాయించుకుంది... ఫైనల్గా అతను డ్రాఫ్ట్ తీసుకుని వెళ్లిపోతూంటే - దాంతో పాటు తన మనసునో, హృదయాన్నో కూడా అతను లాక్కుపోతున్నట్టో, పీక్కుపోతున్నట్టో ఫీలయి పోయింది దమయంతి.

కాసేపు అలాగే, అల్లాడిపోయిం తర్వాత - చల్లటి నీళ్లు కొన్ని తాగి - ఫారంలో వున్న అతని అడ్రస్సుని వేరే కాగితం మీద రాసుకుని - దాన్ని తన హ్యాండ్ బ్యాగ్లో వేసుకుంది!....

ఈ సంఘటన జరిగి - ముప్పయ్ గంటలు కూడా గడవక ముందే - దమయంతి తండ్రి, క్రిష్ణమూర్తి ఇంటి గుమ్మం ముందు నిలబడ్డాడు... అతని తల్లితండ్రుల్ని కల్సుకున్నాడు... అతనికింకా పెళ్లి కాలేదని తెల్సుకున్నాడు...! తనకు ఓ పెళ్లి కావాల్సిన ఆడపిల్ల వుందని చెప్పాడు. ఆ పిల్లను చూసుకునేందుకు రావాల్సిందిగా - వాళ్లను 'పెళ్ళిచూపులకు ఆహ్వానించాడు...

ఆహ్వానాన్ని అందుకున్న ఆరోరోజున - క్రిష్ణమూర్తి, తల్లిదండ్రులతో సహా వచ్చి దమయంతిని చూసుకున్నాడు. అందరి 'ముక్త చూపు' కీ - దమయంతి నచ్చింది... బ్యాంకులో నెలకు పదిహేను వేలకుపైగా జీతం... తల్లితండ్రులకు ఒక్కగానొక్క సంతానం... ఆస్తి పాస్తులు అంతో ఇంతో వున్న కుటుంబం...! ఈ అదనపు అర్హతలు కూడా అందరికీ బాగా వచ్చాయి...

పెళ్లి చూపులు పూర్తయి మూడు నెలలు కూడా తిరక్కముందే - దమయంతి, క్రిష్ణమూర్తికి భార్యగా వచ్చింది... అలా వచ్చిన మరో మూడు నెలల్లో, తమ బ్యాంకులో ఖాతాలున్న పెద్దపెద్ద కంపెనీల తాలూకు మేనేజర్లను అభ్యర్థించి - కిష్ణమూర్తికి ఓ ఉద్యోగం కూడా ఇప్పించింది....

ఇంత వరకూ అంతాబాగానే వుంది... ఆ తర్వాతే కథ మలుపు తిరిగింది!...

ఓ రోజు రాత్రి భోజనం చేస్తూ దమయంతికి చెప్పేడు కిష్ణమూర్తి -"నేను టీవీ సీరియల్ లో యాక్ట్ చేయాలనుకుంటున్నాను!' - అని. దమయంతి అయోమయంగా అతనివైపు చూసింది.

"ఇపుడు సడెన్గా ఈ ఆలోచన ఎందుకొచ్చిందీ?" - వెంటనే అడిగింది.

"మా కంపెనీలో – 'కంప్యూటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరిమళ లేదూ?... ఆవిడగారి మొగుడు పెద్ద ప్రొడ్యూసరట!... ఇది వరకు 'నీ మొగుడే నామొగుడు' అనే సీరియల్ తీశాట్ట... త్వరలో 'ఎవరి మొగుడు ఎవరికి స్వంతం' – అనే కొత్త సీరియల్ ప్రారంభిస్తున్నాట్ట!... అందులో హీరో వేషం నాకు ఇప్పిస్తానంది?" చెప్పాడు.

అతనితో పాటే భోజనం చేస్తున్న దమయంతికి ఎందుకో ముద్ద గొంతుదిగలేదు...

"తను అంటే సరిపోతుందా?... ఆ ప్రొడ్యూసర్‌కి మీరు నచ్చాలిగా?"–కాసిని మంచి నీళ్లు తాగిం తర్వాత అడిగింది.

"ఆ ప్రశ్నే నేనూ అడిగాను!... అప్పుడు తను ఏం చెప్పిందో తెలుసా?"

"ఏం చెప్పింది?"

"నేను ఈ గిరజాల జుట్టులో – అచ్చం చిన్నప్పట్టి 'సీనియర్ ఎన్టీఆర్' లా వుంటానట... నన్ను ఏ సినిమా డైరెక్టర్ చూసినా – ఎగరేసుకుపోతాట్ట!.. రేపు సాయంత్రం వాళ్లింటికి కాఫీకి రమ్మంది... వాళ్లాయనకు పరిచయం చేస్తానంది... ఆయనకు తన మాటంటే వేదవాక్కుట!... అందుకే తన పేరు 'పరిమళ' అయినా – 'వేదా' అని పిలుస్తాడట... తప్పకుండా రమ్మని మరీమరీ చెప్పింది" – ఎంతో ఉత్సాహంగా, కొంత అమాయకంగా చెప్పాడు క్రిష్ణమూర్తి...

దమయంతికి మరి అన్నం సహించలేదు... ఆ రాత్రి నిద్ర కూడా పట్టలేదు... ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు ఆమె మనసును అల్లకల్లోలం చేశాయి...

ఆదమరచి నిద్రపోతున్న కిష్ణమూర్తిని – తట్టి లేపింది.

"ఏమిటి దమయంతీ?... ఏమైందీ?"... ఉలిక్కిపడి లేచిన క్రిష్ణమూర్తి అడిగాడు.

"ఆవిడకు వయసెంతుంటుందీ?" అడిగిందామె వెంటనే.

"ఏవిడకీ?"

"అదే – మీ కంపెనీలో పని చేస్తున్న ఆ వేదవాక్కుల పరిమళకి?"

ఉంటుంది...! బాగానే వుంటుంది... అర్ధరాత్రి పూటా మద్దెల దరువన్నట్టు ఇప్పుడావిడ గురించి మనకెందుకుగానీ... పడుకో"... అంటూనే ముసుగు తన్ని – పక్కకు తిరిగి పడుకున్నాడు కిష్ణమూర్తి...

మర్నాడు అతను ఆఫీసుకి వెడుతూంటే... టిఫిన్ బాక్స్ అందిస్తూ అడిగిందామె –

"ఏవండీ... నేనంటే మీకు ఇష్టమేనా?"

"ఇష్టం మాత్రమే కాదు... నువ్వంటే ప్రాణం!" – ఆమె నుదుటి మీద ముద్దుపెట్టిమరీ చెప్పాడతను.

"అయితే నామాటకు విలువిస్తారా?"

"విలువేం ఖర్మ!... తు.చ. తప్పకుండా పాటిస్తాను!... చదువూ సంధ్యా, ఉద్యోగం సద్యోగం, ఆస్తీపాస్తీ – ఏమీ లేని నన్ను ఏరికోరి చేసుకున్నావ్... నీ పలుకుబడి ఉపయోగించి ఉద్యోగం కూడా ఇప్పించావ్... అలాంటప్పుడు నీ మాటకు విలువివ్వకుండా ఎలా వుండగలనూ?"

"అయితే – మీరు ఆ టీవీ సీరియల్‌లో యాక్ట్ చెయ్యటానికి వీల్లేదు!" – అందామె.

క్రిష్ణమూర్తి తెల్లబోయాడు... అంతకు ముందు రాత్రి జరిగిన సంభాషణ అతనికి గుర్తుకొచ్చింది.

"నీ కిష్టం లేకపోతే చెయ్యను?" – సిన్సియర్‌గానే చెప్పాడు క్రిష్ణమూర్తి.

"అంతే కాదు!... ఇవాళ ఆ పరిమళ మళ్లీ పిలిచినా సరే, మీరు వాళ్లింటికి కాఫీకి వెళ్ళకూడదు...!" గబగబా చెప్పేసి – తన గదిలోకి వెళ్లిపోయిందామె...

అటే చూస్తూ ఆమె మాటల్లోని అంతరార్థాన్ని వెతికే ప్రయత్నం చేశాడు క్రిష్ణమూర్తి.

ఆ తర్వాత – మరో నెలరోజులకి – వేరే కంపెనీలో అతనికి ఉద్యోగం సంపాదించి పెట్టింది దమయంతి... ఆ కంపెనీలో – కంప్యూటర్ అసిస్టెంట్లు కాదుకదా, కాఫీలు సప్లయ్ చేయటానిక్కూడా ఆడవాళ్లు పనిచేయటం లేదని – నిర్ధారణ చేసుకున్న తర్వాతనే – ఆ ఉద్యోగం ఇప్పించింది... కొన్ని రోజులు సాఫీగానే గడిచిపోయాయి... ఆ తర్వాత అనుకోకుండా ఓ సంఘటన జరిగింది!...

ఆవేళ – 'లంచ్‌బ్రేక్'లో – టిఫిన్ బాక్సు తెరవబోతూంటే – మేనేజరు, ఏదో ఫైలు తీసుకురమ్మని – క్రిష్ణమూర్తికి 'ఇంటర్‌కం' లో చెప్పాడు... వెంటనే 'బాక్సు' మూసేసి, ఆఫైలు పట్టుకుని – మేనేజరు గదిలోకి వెళ్లాడు.

ఆ సమయానికి మేనేజరు భార్యకూడా ఆ గదిలో కూర్చుని వుంది...

ప్రతి రోజూ మధ్యాహ్నం వేళ – మేనేజరుకి – పని కుర్రాడు క్యారియర్ తెస్తూంటాడు... అప్పుడప్పుడు మాత్రం ఆవిడగారే స్వయంగా తీసుకొచ్చి– భర్తతో కలసి తనూ అక్కడ భోంచేస్తూంటుంది... ఫైలు పట్టుకుని లోపలకు వచ్చిన కిష్ణమూర్తిని – చిరునవ్వుతో ఆహ్వానించాడు మేనేజరు...

'రావోయ్ క్రిష్ణమూర్తీ!... మీట్‌మై బెటర్ హాఫ్... మిసెస్ సువర్చల...!' అంటూ తన భార్యను పరిచయం చేశాడు...ఆవిడ అప్రయత్నంగా అతనికి నమస్కరించింది.

ఆవిడకు – అతను కూడా మర్యాదపూర్వకంగా ప్రతి నమస్కారం చేశాడు... కొన్ని క్షణాలపాటు అతనివైపు చూసిన సువర్చల – అంతలోనే ఏదో గుర్తు కొచ్చినదానిలా–

"మీరు 'రాఘవేంద్ర కాలేజి'లో చదివారు కదూ?" – అని అడిగింది హఠాత్తుగా...

"ఔనండీ!" వినయంగా చెప్పాడు క్రిష్ణమూర్తి.

"అదీ... అలా చెప్పండి!... ఎక్కడ చూశానా అనుకుంటున్నాను...! నేనూ అక్కడే చదివాను లెండి... అయిదేళ్ళయి పోయినా – మిమ్మల్ని సులువుగానే గుర్తుపట్టేను... నేను అప్పుడప్పుడు మావారి కోసం వస్తూనే వున్నా – మీరు ఇక్కడ పనిచేస్తున్నట్టు నాకు తెలీనే తెలీదు..." – గలగలా చెప్పేస్తోంది...

"అప్పుడే రెండు నెలలయిందోయ్ ఇతను మన కంపెనీలో చేరి"...! మేనేజరు చెప్పాడు ఆమెకి. ఏం మాట్లాడాలో తెలీక – అక్కడ వుండాలో వెళ్లాలో అర్థంకాక ఇబ్బందిపడుతూ అలాగే నిలబడిపోయాడు క్రిష్ణమూర్తి.

"ఏవండీ... ఇతను ఇప్పుడే ఇంత అందంగా వుంటే – అయిదేళ్ళ క్రితం ఇంకెంత అందంగా ఉండేవాడో ఊహించుకోండి... అప్పుడు నేను వేరే సెక్షన్‌లో వుండేదాన్ని...! మా 'గరల్స్' అందరం ఇతని అందాన్ని తెగ 'అడ్మైర్' చేసేవాళ్ళం...! ముఖ్యంగా – అదిగో ఈ గిరిజాల జుట్టు చూసి మేం తెగ ముచ్చట పడిపోయే వాళ్ళం... ఏదో ఒకరోజున సినిమా హీరో కూడా అయిపోతాడని అనకునేవాళ్ళం"... అంటూ ఇంకా అలాగే ఏమిటేమిటో ఉత్సాహంగా ఆవిడ చెప్పేస్తూంటే – క్రిష్ణమూర్తి బోలెడంత సిగ్గుపడి పోయాడు...

"అబ్బ!... కట్టుకున్న మొగుడి ముందు– పరాయి మగాణ్ణి అలా మెచ్చుకోవటం అంత బాగుండదేమో సువర్చలా!.... పైగా అతను నా సబార్డినేటు!" – అన్నాడు మేనేజరు నవ్వుతూ...

"గడ్డిమేటేం కాదూ? ఇప్పుడు మీకు సబార్డినేటే కావచ్చు... కానీ ఒకప్పుడు నా 'కాలేజిమేటు'. ఇప్పట్నించీ మనిద్దరికీ మంచి ఫ్రెండు"– క్యారియర్ 'ఓపెన్' చేస్తూ చెప్పిందామె.

"ఓకే!... తమరి మాట మేం ఎప్పుడు కాదన్నాం కనుక?"– మేనేజరు కూడా ఆమె నవ్వుకు శృతికలుపుతూ – రెండు చేతులూ జోడించి, భార్యా విధేయుడి పోజులో అన్నాడు.

"క్రిష్ణమూర్తీ... నువ్వు లంచ్ చేశావా?" – చొరవగా ఏకవచన ప్రయోగం చేస్తూ అడిగింది సువర్చల అంతలోనే.

"ఇంకా లేదు మేడం!... చెయ్యాలి!"

"అయితే కమాన్! మాతో కల్సిచేద్దువుగాని!" – ఓ ప్లేటు అతనికి అందిస్తూ చెప్పింది.

"అబ్బే... ఎందుకండీ?... నేను లంచ్ బాక్స్ తెచ్చుకున్నాను!"

"నువ్వుతెచ్చుకోలేదనీ, మధ్యాన్నంపూట లంచ్ చెయ్యకుండా ఉపవాసాలుంటావనీ కాదు... మొహమాట పడకుండా కూచో!" – అంటూనే మూడోప్లేటులో కూడా వడ్డన చేసేసింది.

క్రిష్ణమూర్తి 'సబార్డినేట్ సంశయం'తో మేనేజరువైపు చూశాడు.

"కూర్చోవయ్యా మగడా!... సువర్చల ఆర్డరేసిందంటే - సుప్రీంకోర్టుకి వెళ్లినా అప్పీలుండదు... కమాన్!.. కానియ్!"- తన ప్లేటు ముందుకు లాక్కుంటూ చెప్పాడు మేనేజరు.

క్రిష్ణమూర్తి కూచున్నాడు.. అతను భోజనం చేస్తున్నంత సేపూ - అతని వివరాలన్నీ అడిగి తెల్సుకుంది సువర్చల. ఆ కొద్ది సేపట్లో - వాళ్ళ కుటుంబంలో తానూ ఒక సభ్యుడిగా మారిపోయిన ఫీలింగ్ కలిగిందతనికి.

"రేపట్నించీ నువ్వు 'లంచ్ బాక్స్' తెచ్చుకోవద్దు... మావారికి ఎలాగా 'క్యారియర్' పంపుతానుకదా.... నువ్వూ అందులోనే లాగించెయ్యచ్చు!" - భోజనం పూర్తయ్యాక గిన్నెలు సర్దుతూ చెప్పింది సువర్చల.

"అబ్బే... వద్దండీ... మీకెందుకు శ్రమ?"

"ఇందులో శ్రమేముంటుందయ్యా?... నీకోసం ప్రత్యేకించి చేసేదేమీ వుండదులే... ఇది వరకు వాళ్ళన్నయ్య ఇక్కడ కొన్నాళ్లు పనిచేశాడు... అప్పుడు తను మా ఇద్దరికీ క్యారియర్ పంపేది!.. మేం కబుర్లు చెప్పుకుంటూ భోంచేసేవాళ్ళం!.. అతనిప్పుడు వేరే కంపెనీకి వెళ్లిపోయాడులే!... అతని ప్లేసులోనే నిన్ను తీసుకున్నాను కనుక - నువ్వూ నాకు బావమరిదివే అనుకుంటాను... 'లంచ్ టైం'లో రోజూ నా రూమ్‌కి వచ్చెయ్..." మేనేజరు చెప్పాడు.

ఇప్పుడు ఆమె భర్తనించి అయాచితంగా లభించిన అభిమానానికి ఎంతో మురిసిపోయాడు క్రిష్ణమూర్తి...

"ఓ ఆదివారం ఎప్పుడైనా మీ ఆవిణ్ణి తీసుకుని మా ఇంటికి రావాలి!" - తిరిగి వెడుతున్నప్పుడు ఆర్డరేసింది సువర్చల...

ఆ సాయంత్రం ఆఫీసు నించి ఇంటికి రాగానే - హుషారుగా భార్యను పిలిచాడు క్రిష్ణమూర్తి.

'నీకో శుభవార్త దమయంతీ! - రేపట్నించీ నాకు 'లంచ్ బాక్స్' ఇచ్చే శ్రమ నీకు తప్పిపోయింది!" - కాఫీ కప్పుతో వచ్చిన భార్య చేతిలోంచి కప్పు అందుకుని, తన చేతిలో వున్న 'టిఫిన్ బాక్స్' ఆమెకు అందిస్తూ చెప్పాడు.

"అంటే... రేపట్నించీ, 'లంచ్' ఆఫీసులో చెయ్యరా?" - అనుమానంగా చూస్తూ అడిగింది దమయంతి.

"చేస్తాను!... కానీ సువర్చల మేడం క్యారియర్ పంపిస్తుంది!"

"సువర్చలా మేడమా?... ఆవిడెవరు?"

అంతకుముందు ఆఫీసులో జరిగిన వృత్తాంతం యావత్తూ - పూసగుచ్చినట్టుగా ఆమెకు వివరించి చెప్పాడు. దమయంతి అయోమయంగా చూస్తూ నిలబడింది...

"ఆ!... అన్నట్టు ఓ ఆదివారం ఎప్పుడైనా నిన్ను వాళ్లింటికి తీసుకురమ్మని ఆహ్వానించింది... నువ్వు ఓకే అంటే వచ్చే ఆదివారం వెళదాం!" - కాఫీ తాగటం పూర్తయ్యాక ఖాళీకప్పు ఆమె చేతిలో పెడుతూ చెప్పాడు క్రిష్ణమూర్తి.

దమయంతికి ఆ రాత్రి మళ్లీ అన్నం సహించలేదు... నిద్ర కూడా పట్టలేదు.

మర్నాడు యధాప్రకారం అతను ఆఫీసుకి బయల్దేరబోతూంటే - చేత్తో ఓ కాగితం పట్టుకుని వచ్చిందామె.

"ఆఫీసుకి వెళ్ళగానే - ఆ 'లెటర్' మీద సంతకం చేసి - మీ మేనేజరుకి ఇచ్చేయండి!" అంటూ దాన్ని అతని చేతిలో పెట్టింది...

"ఏమిటిదీ?"

"మీ 'రిజిగ్నేషను లెటరు. రేపట్నించీ మీరు ఆ ఆఫీసులో పనిచేయటం లేదు... వేరే ఏదైనా కంపెనీలో 'జాబ్'కి ట్రై చేద్దాం!" - చెప్పింది...

"ఏం?... ఎందుకనీ?... ఈ కంపెనీ బాగానేవుందిగా!... పైగా మేనేజరు నా క్లాస్‌మేట్ మొగుడే!... నాకు మంచి ఫ్రెండయి పోయాడు!" - అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు...

మధ్యలోనే దమయంతి కల్పించుకుంది-

"అందుకే వద్దంటున్నాను... ఇవాళ మేనేజరు 'మంచి' ఫ్రెండయ్యాడు... రేపు వాళ్లావిడ'ఇంకా మంచి' ఫ్రెండవుతుంది... ఎల్లుండి మరేమవుతుందో... ఇలాంటివి నాకు నచ్చవ్... అసలే మీ పేరు క్రిష్ణమూర్తి కూడానూ!" - అంటూనే గబగబా తన ఆఫీసుకి వెళ్లిపోయింది దమయంతి...

"హా.. హతవిధీ!" అనుకుంటూ ఆమె వెళ్లిన వైపే దిగ్భ్రాంతిగా చూస్తూండి పోయాడు క్రిష్ణమూర్తి.

(యోజన

నవంబర్ -2004)

కథా నిలయం
6053.
శ్రీకాకుళం